# చిప్స్

# సమాచార భాండాగారం 'గూగుల్'

– సునీల్ మోహన్

మనకు సమాచారం అవసరమైనప్పుడు నానాపాట్లు పడుతుంటాం. సమాచారం ఎక్కడ దొరుకుతుందో అని వెంపర్లాడతాం, పుస్తకాలను అధ్యయనం చేసే వారిని సంప్రదిస్తాం. ఒక్కోసారి అగాధంలో ఉన్నట్లుంటుంది. ఇవన్నీ IT విప్లవానికి ముందురోజుల్లోని వరుస. నేడు సమాచారానికి మనం ఇంటర్నెట్‌ను ఆశ్రయిస్తున్నాము. ఇదో సమాచార భాండాగారం. ఈ భాండాగారంలో వెతుక్కుంటూ పోతే ఒక్కోసారి గమ్యాన్ని మరచిపోవడమేగాక, వెనుతిరిగిచూసుకునేటప్పటికి గంటలు గంటలు గడిచిపోతాయేతప్ప ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుంది. ఇంతటి సమాచార భాండాగారాన్ని శోధించి, మనకు కావాల్సిన సమాచారాన్ని అందించే వారధిగా "గూగుల్" సెర్చ్ ఇంజన్ వ్యవహరిస్తుంది. సమాచారం కోసం ఎక్కువమంది ఇంటర్నెట్ బ్రౌజర్‌ను తెరిచిన వెంటనే www.google.comనే ఉపయోగిస్తారంటే అతిశయోక్తికాదు. ఇంగ్లీష్‌తోపాటు తెలుగు, హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం వంటి భారతీయ భాషల్లోనూ కావాల్సిన సమాచారాన్ని నిమిషాలమీద అందించే ఈ సైట్‌లో సుమారు 800 కోట్ల పేజీలున్నట్లు గూగుల్ సంస్థ పేర్కొంటోంది.

## గూగుల్ తెలుగు

గూగుల్ సెర్చ్ నుండి తెలుగులోనూ శోధన చేయవచ్చు. మనము చూసే గూగుల్ వెబ్ పేజీ తెలుగులో కనిపించటమేకాదు, ఇతర తెలుగు వెబ్ పేజీలను వెతకటం కోసం కూడా ఉపయోగపడుతుంది. గూగుల్ వెబ్‌పేజీ తెలుగులో రావటానికి "Google India"కు వెళ్ళి అక్కడ తెలుగును ఎంచుకోవాలి. లేదా సూటిగా http://www.google.co.in/teను దర్శించవచ్చు. తెలుగులో ఈ సౌకర్యాలుండాలంటే మీ బ్రౌజర్, మోజిల్లా ఫైర్‌ఫాక్స్ లేదా ఇంటర్నె ట్ ఎక్స్‌ప్లోరర్ 6.0 అయిఉండాలి. తెలుగు సెర్చ్‌ను పరిపూర్ణంగా వినియోగించడానికి మీరు దర్శించాల్సిన చిరునామా : http://te.wikipedia.org .

## గూగుల్ కాష్

ఇంటర్నెట్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కంప్యూటర్ల వల్ల మనకు లభ్యమవుతుంది. మనం చూసే ఆయా వెబ్‌సైట్లను ఏ కంప్యూటర్ నుండైనా పొందవచ్చు. ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించాలనుకున్నప్పుడు ఆ వెబ్‌సైట్‌కు సంబంధించిన కంప్యూటర్ కనుక విద్యుత్ లేకనో ఇతర సమస్యలవల్లనో అందుబాటులో లేకపోతే మనం కోరిన వెబ్‌సైట్‌ను పొందలేము. కొన్నిసార్లు వెబ్‌సైట్‌పై అధిక ఒత్తిడి వున్నప్పుడు కూడా మనకు కావలసిన పేజీ పొందడంలో జాప్యం జరుగుతుంటుంది. ఇలాంటి సమయాల్లో గూగుల్ మనకు ఉపయోగకారిగా ఉంటుంది. మొదట మనం కావాలనుకుంటున్న పేజీ శోధన ఫలితాల్లో వచ్చేలా ప్రయత్నించాలి. ఒకవేళ దొరక్కపోతే "భద్రపరిచినది" లింక్ ద్వారా గూగుల్ దాచిన పేజీని పొందవచ్చు. అయితే ఈ పేజీ కొంతకాలం క్రితందై ఉంటుంది. ఇప్పటి పేజీకై మనము వెబ్‌సైట్‌కు వెళ్ళకతప్పదు.

## గూగుల్ నిర్వచనాలు

మనకి తెలియని పదాలకు అర్థాలు వెతకటం కోసం నిఘంటువును వాడతాము. మరి సాంకేతిక పదాల పరిస్థితి ఏంటి? కొంత వరకు సాంకేతిక నిఘంటువులు సహాయపడతాయి. కానీ అన్ని రంగాల్లో నిఘంటువులు వాడటం సాధ్యం కాదు. మరి...... పదాల అర్థాలు తెలుసుకోటానికి ప్రపంచవ్యాప్తంగా అన్ని వెబ్‌సైట్లలోనూ నిక్షిప్తమైన మేధస్సుని వాడుకోగలమా? ఖచ్చితంగా వాడుకోగలం. అన్ని వెబ్‌సైట్లలోని అర్థాలను జతచేర్చి మనకందిస్తుంది గూగుల్ . గూగుల్‌లో శోధించేటప్పుడు "define:" తరువాత కనుక మనము శోధనా పదాన్ని ఇస్తే గూగుల్ ఆ పదానికి ఇవ్వబడిన అర్థాలన్నింటినీ చూపిస్తుంది. ఉదాహరణకు "define: CDROM" అని శోధనచేస్తే, "CD ROM"కు ఉన్న అర్థాలన్ని గూగుల్ చూపుతుంది.

## గూగుల్ సైట్ సెర్చ్

ఎక్కువ సందర్భాల్లో మనం ఏదోక వెబ్‌సైట్‌కెళ్ళి మనకు కావలసిన సమాచారం కోసం వెతుకుతుంటాము. ఆయా వెబ్‌సైట్లను ఇదివరకే మనం చూసినా, దానిలో సమాచారం ఉందని తెలిసినా అది ఎక్కడ ఉందో తెలుసుకోటానికి కొట్టుమిట్టాడుతుంటాము. కొన్ని వెబ్‌సైట్‌లలో "సెర్చ్" అవకాశం వుండవచ్చు, మరికొన్నింటిలో లేకపోవచ్చు. ఒకవేళ ఏదైనా వెబ్‌సైట్‌లో సెర్చ్ అవకాశం ఉన్నా గూగుల్ అంత పరిపూర్ణంగా ఈ అన్వేషణ ఉండదని చెప్పవచ్చు. సమాచార అన్వేషణలో ఎదురయ్యే సమస్యను గూగుల్ "సైట్ సెర్చ్" ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఉదాహరణకు మనకు gnu.org వెబ్‌సైట్‌లోని philosophy పేజి కావాలనుకోండి. మనం గూగుల్ సెర్చ్‌లో కనుక "philosophy site: gnu.org"అని శోధించినట్లయితే, gnu.org వెబ్‌సైట్‌లో philosophy అనే పదము ఉన్న పేజీలను మాత్రమే మనకు వెతికిపెడుతుంది.

## సెర్చ్ వర్డ్ సబ్ ట్రాక్షన్

సమాచార అన్వేషణకు మనం వాడే పదాలకు బహుళార్థాలు ఉండొచ్చు. మనకు అవసరమైన అర్థంకాకుండా, వేరే అర్థం కనుక అధిక ప్రాచుర్యంలో ఉన్నప్పుడు, ఈ రెండవ అర్థానికి సంబంధించిన ఫలితాలను గూగుల్ ఎక్కువగా చూపిస్తుంది. వచ్చిన వేల ఫలితాలలో మనకు అవసరమైన ఫలితాలు వెతకటం చాలా శ్రమతో కూడిన పని. కాని మనము గూగుల్‌కి ఆ రెండవ అర్థానికి సంబంధించిన ఫలితాలను చూపించవద్దని చెప్పగలిగితే, మన పని సులువు అవుతుంది. ఇలా చెయ్యటానికి అవకాశం గూగుల్ మనకి కల్పిస్తుంది. మన శోధన పదం రెండవ అర్థంతోపాటు ఉండే పదాలను ముందుగా మనం సమకూర్చుకోవాలి. ఆపై మన శోధనకు ఆ పదాలను మైనస్‌తో పాటు జోడించాలి. ఉదాహరణకు కంప్యూటరుకి ఉండే చూపుడు యంత్రం కోసం "mouse" అని శోధన చేస్తే మనకి ఎలుకల గురించిన చాలా ఫలితాలు వస్తాయి. ఎలుకల గొడవ వదిలించుకోవాలంటే "mouse-rat" అని టైపు చేస్తే ఎలుకలకి సంబంధించిన ఫలితాలు గూగుల్ తీసివేస్తుంది. కంప్యూటర్‌కి సంబంధించిన ఫలితాలే మనకి మిగులుతాయి.

## గూగుల్ న్యూస్ ఎలర్ట్స్

అన్ని దినపత్రికలు అన్ని వార్తలను ప్రచురించవు. మనకి ఒక అంశంపై అన్ని పత్రికల వార్తలు కావాలనుకుంటే...? పైగా ఒక అంశంపై వార్తలను ఒక పత్రిక మొత్తం, లేదా అన్ని పత్రికలను వెతకటం సాధ్యం కాదు. మరి, ఆ అంశంపై ఘటన జరిగిన నిమిషాల్లోనే ఆ సమాచారం మనవద్ద ఉండాలంటే గూగుల్ న్యూస్ ఎలర్ట్స్‌ను ఉపయోగించవచ్చు. గూగుల్ న్యూస్ పేజీలో కొన్ని పదాలు ఇచ్చి ఆ పదాలు కలిగిన వార్తలన్నీ మీ e-mail కు పంపించమని గూగుల్‌ను కోరవచ్చు. "petrol" ని గనుక శోధన పదంగా ఇస్తే, పెట్రోల్ సంబంధిత వార్తలన్నీ వచ్చిన కొద్ది నిమిషాల్లోనే ఆ సమాచారం మన e-mailకు చేరుతుంది.

## గూగుల్ కాల్క్యులేటర్ మరియు కరెన్సీ

చిన్న చిన్న అవసరాల కోసం లెక్కలు వేయాల్సిరావటం సహజం. అలాగే తరచు ఒక వస్తువు ధర డాలర్లలోనే తెలిస్తే రూపాయలలో ఎంతబ్బా అని ఆలోచిస్తూ ఉంటాము. ఈ చిన్న సౌకర్యాన్ని కూడా గూగుల్ మనకు అందజేస్తుంది. మీరు శోధన పదాలుగా "23+34*12" అని కాని, "5 feet in meters" అని కానీ ఇస్తే గూగుల్ మీకు ఇచ్చే సమాధానము మిమ్మల్ని ఆశ్చర్యచకితులను చేస్తుంది. మరిక సాధారణంగా దొరికే కాల్క్యులేటర్లకు అందని లెక్కలు కూడా గూగుల్ చేయగలదు. ఉదాహరణకు "2^20" లేదా "100 !" ఇచ్చి చూడండి. గూగుల్ ఇట్టే జవాబు చెప్తుంది.

## స్పెల్ చెకింగ్

తెలుగు భాషలో ఉచ్ఛరణ, వ్రాత ఒకే రకంగా వుంటుంది. అదే ఇంగ్లీషులో తెలుగులో వలే పలికినదే రాయకపోవటం, రాసేటప్పుడు, టైపు చేసేటప్పుడు తప్పులు చేయటం సాధారణం. గూగుల్ టూల్ బార్‌ను కంప్యూటర్లో స్థాపించినట్లయితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఫైర్ ఫాక్స్ లేదా ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్‌లకు మాత్రమే ప్రస్తుతానికి ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. ఈ గూగుల్ టూల్‌బార్‌ను కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేసిన తర్వాత వెబ్‌సైట్‌లో ఏదయినా సమాచారం పంపించేముందు గూగుల్ టూల్‌బార్‌లోని "spell check" మీటను నొక్కితే సరిపోతుంది. మనము చేసిన తప్పులను మాత్రమే కాకుండా, సరైన పదాలకు సలహాలు కూడా గూగుల్ చూపుతుంది.

## గూగుల్ డెస్క్‌టాప్ సెర్చ్

గూగుల్ కేవలం వెబ్‌సైట్‌లను వెతకటానికి మాత్రమే పరిమితం కాదు. గూగుల్ డెస్క్‌టాప్‌ను మన కంప్యూటర్‌పై స్థాపించినట్లైతే, కంప్యూటర్‌లో ఉన్న అన్ని రకాల ఫైళ్ళలోను మనం పదాలకోసం శోధన చెయ్యవచ్చు. ఆఫీసు ఫైళ్ళు, ఈ మెయిల్‌లోని పదాలు, ఇంటర్నెట్‌పై సంభాషణలు, ఇంటర్నెట్‌లో మీరు దర్శించిన వెబ్‌పేజీల చరిత్ర, చలన చిత్రాల ఫైళ్ళు, ఛాయాచిత్రాల ఫైళ్ళు, పాటల ఫైళ్ళు అన్నింటిలోని సమాచారాన్ని వెతకటం సాధ్యమవుతుంది.

## గూగుల్ గ్రూప్స్

మీరు పంపే ఇ–మెయిల్ చాలామందికి అందాలి. అలాగే వారు పంపిన జవాబులు కూడా అందరికి అందాలి. ఇలా సంభాషణలు జరగాలి. మధ్యలో కొందరి జాబితాలు జతపర్చాలి, లేక తొలగించాలి. పంపించుకున్న సమాచారం అంతా భద్రపరచాలి. ఈ పనులన్నింటినీ గూగుల్ గ్రూప్స్ సులువు చేస్తుంది. గూగుల్ గ్రూప్స్‌లో మీరు ఒక గ్రూప్‌ను నమోదు చేసుకుని, దానిలో ఉండాలనుకున్న వారందరి ఇ–మెయిల్స్‌ను జతచేస్తారు. ఆ గ్రూప్‌కు కూడా ఒక ఇ–మెయిల్ ఉంటుంది. ఈ ఇ–మెయిల్‌కు పంపిన సమాచారం మొత్తం అందరికి చేరుతుంది.

ఇంటర్నెట్‌లోని సమాచార భాండాగారాన్ని శోధించి, ఛేదించడానికి గూగుల్‌ను మించిన మరో సెర్చ్‌ఇంజన్ ప్రస్తుతానికి లేదనేచెప్పాలి. ఎటొచ్చీ దాన్ని ఎంత సమగ్రంగా మనం ఉపయోగించుకోగలమనేదానిపైనే సత్ఫలితాలు ఆధారపడివుంటాయి.



# సరసమైన ధరకే యాపిల్ 'ఐ-బుక్'

హార్డ్‌వేర్ రంగంలో రారాజు అయిన యాపిల్ కంప్యూటర్స్ ఖాతాలో నేడు మరొక ఐ–బుక్‌ను నమోదు చేసుకుంది. యాపిల్ తయారు చేసే హార్డ్‌వేర్ ప్రపంచంలోకెల్లా ఉత్తమమైనది. అదే సందర్భంలో దాని ఖరీదు కూడా ఎక్కువగానే వుంటుంది. కానీ ఇప్పుడు విడుదల చేసిన ఐ–బుక్ (ల్యాప్‌టాప్)ను సరసనమైన ధరకే విక్రయించనుంది. 1.42 గిగాహోర్ట్జ్ వేగంతో నడిచే ప్రాసెసర్, 512ఎంబీ రామ్ కలిగిన ఈ ఐ–బుక్‌ను 999డాలర్లకు విక్రయిస్తున్నారు. స్క్రోలింగ్ ట్రాక్‌పాడ్, సడన్ మోషన్ సెన్సర్లు కలిగిన ఐ–బుక్‌ను యాపిల్ పేటెంట్ చేసింది. ఈ సడన్‌మోషన్ సెన్సర్స్ గతుకుల్లో ప్రయాణించేపటప్పుడు, హఠాత్తుగా కిందపడినప్పుడు, షాక్‌కు గురయినప్పుడు హార్డ్‌డిస్క్‌లోని సమాచారానికి ఎలాంటి హానికలుగకుండా భద్రపరుస్తుంది. ఆరు గంటల వరకు పనిచేసే బ్యాటరీ, బ్లూటూత్ సౌకర్యం ఈ ఐ–బుక్‌ని వినియోగదారునికి మరింత చేరువ చేస్తుందంటున్నారు యాపిల్ వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ మూడీ.

# ఊబకాయం మతిమరపును కలుగజేస్తుందా?



కాదని కొట్టిపడేయలేమిప్పుడు ! స్థూలకాయులలో అధికంగా ఉత్పత్తి అయ్యే 'లెప్టిన్' అనే హార్మోన్ మతిమరపును కలుగజేయవచ్చు.

జీర్ణాశయంలో విడుదలయ్యే 'లెప్టిన్' అనే హర్మోన్ జీర్ణప్రక్రియలో సహాయం చేస్తుందని, ఆకలిని నియంత్రించడానికి ఉపకరిస్తుందని ఇప్పటివరకూ తెలిసిన విషయం. కొవ్వుకణాలు ఈ హార్మోన్‌ని ఉత్పత్తి చేస్తాయని, దీని వలన ఆకలి తగ్గుతుందని మాత్రమే తెలుసు.

కానీ ఆశ్చర్యకర విషయమేమంటే లావుపాటి వ్యక్తులలో 'లెప్టిన్' అధికంగా ఉత్పత్తి అవుతుందని తెలిసింది. ఆకలి తగ్గించాల్సిన లెప్టిన్, వీరిలో ఆకలిని తగ్గించలేకపోవడంతో అధిక బరువును పొందుతున్నారు. బహుశా ఇది లెప్టిన్‌కు స్పందించలేకపోవడం వల్ల అయి ఉండవచ్చు.

'జెన్నీ హార్వే' యూనివర్సిటీ (UK)లో ఊబకాయాన్ని, మతిమరుపుని పోలుస్తూ పరిశోధనలు జరిపినప్పుడు, లావుగా ఉన్నవాళ్లు ఎక్కువ అల్జిమర్ లాంటి మతిమరుపు జబ్బులతో బాధపడుతున్నట్లు తెలిసింది. అలాగే లెప్టిన్ అధికంగా స్రవించడం మెదడు పనితీరును ప్రభావితం చేస్తుందని కనుక్కున్నారు. ఈ రెండు పరిశోధనలను కలుపుతూ ఊబకాయులలో అధికంగా ఉత్పత్తి అయ్యే లెప్టినే వారిలో మతిమరుపును పెంచుతుందా అనే దిశగా పరిశోధనలు చేస్తున్నారు.

జెన్నీహార్వే యూనివర్శిటీ వారు ఇప్పుడు స్థూలకాయం ఉన్న పిల్లలతో లెప్టిన్ అధికంగా ఉత్పత్తి అవ్వడం వలన వాళ్ళ చదువు మీద ఎలాంటి ప్రభావం ఉందని పరిశోధన చేయ్యాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

కాబట్టి వాళ్ళ పరిశోధనల ఫలితం తేలే వరకూ, పిల్లలు బొద్దుగా ఉన్నారా లేదా అన్నదానికన్నా వారి ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం ఉత్తమం.

– పావని

# 'సైట్'గొడుతుండు

సైబర్ సెటైర్

మా దోస్తు మూడునెల్ల కింద ఓ కలర్‌టీవీ గొన్నడు. అది గొన్నకాడ్నుండి ఆడి కొడుకు దినాం ఇస్కూలు ఎగ్గొట్టి దాన్నే జూడబట్టిండు. గిట్ల సిన్మాలు జూసిన గా పోరడు. కొద్దిదినాలకే ఛానల్స్ మార్చుడు ఇస్టాట్ చేసిండు. గట్ల ఎవ్వల్లూ చూడకుండా ఫ్యాషన్‌ఛానల్, మిడ్‌నైట్ మసాలా లాంటివి జూడబట్టిండు. గిది జూసిన మా దోస్తు గిదుంటే గీ పోరడు ఖరాబైతడని టీవీ అమ్మి కంప్యూటర్ గొన్నడు. దానికి ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకుండు. గట్ల పోరగాని నాలెడ్జీ జరంత ఇంప్రూవ్ చేద్దామనుకుండు. గాని గిక్కడగీన పోరగాడు రకరకాల వెబ్‌సైట్లు ఓపెన్ చేయబట్టిండు. గట్ల చేసినోడు వూకుండాంటే అదీలేదు. గీనడ్మ ఓ పోరికి ఇమెయిల్‌లో లవ్‌లెటర్ పంపిండంట, గట్లనే పక్కింటి పోరికి సైట్‌గొడుతుండంట. గీ సంగతి దెల్సిన మా దోస్తు ఇంటర్‌నెట్ కనెక్షన్ కట్ చేపిచ్చిండు. ఇగ గీ పోరగాడు బుద్దిగ చద్వుతడులే అనుకుండ్రు. గాని పోరడు ఇస్కూలుకు రాటంలేదని ప్రిన్సిపాల్ ఫోన్ జేసిండు. గిది దెల్సిన నేను మా దోస్తును కలుద్దామని బోయిన. గట్ల పోతుంటే గా పోరడిని సచ్చిన కుక్కను గుంజకొస్తున్నట్లు బజార్ల గుంజకొస్తుండు. ఎక్కడి నుండి పట్టుకొస్తున్నవ్‌రాబై గీడ్ని అని అడిగిన. "ఇంట్లె నెట్ డిస్‌కనెక్ట్ చేసినప్పటి సంది గీడు ఇంటర్‌నెట్ సెంటర్ల దూరబట్టిండురా బై..." అన్నడు.



– ఎం.

# "డీప్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్" పేరిట పరిశోధనలు

ఉల్కలు వాటి గమనంపై బ్రిటీష్ ప్రభుత్వం నాసా సహకారంతో "డీప్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్" పేరిట పరిశోధనలు ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో ఇటీవల శని గ్రహపు ఉపగ్రహమైన "టైటాన్"పై జరిపిన పరిశోధనలు విశ్లేషించారు. దీనినిబట్టి అంతరిక్షం యొక్క పుట్టుక, సౌరకుటుంబ నిర్మాణం గూర్చి మరిన్ని ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. బ్రిటన్‌లో తగ్గిపోతున్న సైన్స్ విద్యార్థులను ప్రోత్సహించి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా భూమిపై నుండే ఉల్కా గమనాన్ని వీక్షించవచ్చు. ఈ పరిశోధనలకు ఆర్థిక సహకారాన్ని ప్రజలనుండి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిశోధనలను ప్రతి సోమవారం ఉదయం 6.30 గంటలకు వీక్షించవచ్చు.